
జలమయమైన స్టేడియం

రెన్యువల్ ఫీజు రెట్టింపు..!




● మద్యం వ్యాపారులకు షాక్ ● లైసెన్సు ఫీజు 100 శాతం పెంపు ● రూ.500 కోట్ల ఆదాయమే లక్ష్యం ● సర్కార్‌పై డీలర్ల ఆగ్రహం

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పలుమార్లు మద్యం ధరలు పెరిగాయి. తాజాగా రెండురోజులక్రిందటే బీర్‌తోపాటు అన్ని బ్రాండ్ల ధరలు పెంచి మద్యం ప్రియులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇది చాలదన్నట్లు వ్యాపారులపైనా ప్రభుత్వం తన శక్తిని ప్రదర్శించింది. గ్యారెంటీ పథకాలకు నిధులు సమకూర్చుకునేందుకు పలు విధాల వ్యూహాలకు సిద్ధమైన ప్రభుత్వం అబ్కారీశాఖ నుంచి రెవెన్యూను భారీగా పెంచుకోవాలని నిర్ణయించింది.

ఏటా జూన్‌లోనే రెన్యువల్

ఏడాదికోసారి జూన్ నెల వచ్చిందంటే మద్యం వ్యాపారులు తల్లడిల్లుతారు. దీనికి ప్రధాన కారణం జూలై 1నుంచి ప్రారంభమయ్యే కొత్త వ్యాపారాల కోసం లైసెన్సుల రెన్యూవల్ లేదా కొత్త షాపులకు అనుమతులు పొందేందుకు కోట్లాదిరూపాయలు చెల్లించక తప్పదు. మరో నెలరోజుల్లోనే మద్యషాపుల లైసెన్సుల రెన్యువల్ జరగాల్సి ఉంది. జూన్ ఆఖరుకు ప్రక్రియ ముగించి జూలై 1 నుంచి కొత్త లైసెన్సుల ద్వారా వ్యాపారం చేయాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 13వేలకు పైగా అబ్కారీ లైసెన్సుదారులు ఉన్నారు. మద్యం వ్యాపారాలు కొనసాగించేందుకు లైసెన్సుల రెన్యువల్ కొరకు సిద్ధంగా ఉన్నారు. ఇదే అదనుగా చూసుకుని సర్కారు లైసెన్సు ఫీజులను పెంచేందుకు సిద్ధమైంది. రూ.2లక్షలు ఉండే లైసెన్స్ ఫీజు రూ.4లక్షలకు పెంచారు. రూ.5 లక్షలున్న చోట రూ.10 లక్షలు పెంచారు. ఇలా ప్రతి లైసెన్స్‌పైనా వందశాతం ఫీజు పెంచారు.

ఆదాయమే సర్కార్ లక్ష్యం

మద్యం వ్యాపారాలు తగ్గుతున్న తరుణంలో రెండు రోజులకిందట దేశీయ మద్యం, బీరు ధరలపై అబ్కారీ సుంకాన్ని పెంచింది. ప్రస్తుతం మరోసారి లైసెన్సుల రూపంలో ఆదాయాన్ని పెంచుకోదలిచింది. 2016లో లైసెన్సు ఫీజులు పెంచారు. ఆ తర్వాత పలుమార్లు ఫీజుల పెంపు ప్రస్తావన వచ్చినా వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం రావడంతో సాధ్యం కాలేదు. ఇటీవలే ప్రభుత్వం లైసెన్సు ఫీజుల పెంపు ప్రస్తావన తీసుకురాగా అందుకు వ్యాపారులు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. అయినా వెనుకడుగు వేసేది లేదని తప్పనిసరిగా ఫీజులు పెంచాల్సి ఉందని ప్రభుత్వం తీర్మానించింది. ఇలా లైసెన్సు ఫీజు పెంచడం ద్వారా సుమారు రూ.500-600 కోట్ల రూపాయల దాకా అదనపు ఆదాయం పొందడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో అబ్కారీశాఖ నుంచి రూ.36,500 కోట్లు ఆదాయం వసూలయ్యింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.40వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగానే అబ్కారీశాఖకు సంబంధించి లైసెన్సులతోపాటు మద్యం ధరలను పెంచేశారు.

రూ.లక్షలకు..లక్షలు పెంపు

డిస్టిలరీలు, బేవరేజస్‌పాటు అన్ని లైసెన్సుల ఫీజులు వందశాతం కంటే అధికంగా పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిస్టిలరీ, బేవరేజస్ లైసెన్సుల ఫీజు రూ.2లక్షలు పెంచారు. కేవలం లైసెన్సు ఫీజు రూ.27 లక్షలనుంచి రూ.34లక్షలకు పెరిగింది. గోడౌన్‌ల ఫీజు రూ.45లక్షల నుంచి రూ.90లక్షలకు పెంచారు. బీరు డిపోల లైసెన్సులు కూడా అమాంతం పెంచారు. 20లక్షల జనాభా కల్గిన ప్రదేశాలు, మహానగరాల పాలికెలలో లైసెన్సు రెన్యువల్ ఫీజు రూ.12లక్షలు, ఇతర నగర పాలికెలలో లైసెన్సు ఫీజు రూ.10లక్షలు, నగరసభల పరిధిలో రూ.9లక్షలు, పట్టణ, పురసభ పంచాయతీలలో రూ.8లక్షలకు పెంచారు. రాష్ట్రంలో 13,567 మంది అబ్కారీ లైసెన్సుదారులు ఉన్నారు. ఇందులో 3,999మంది సీఎల్2 రిటైల్ వ్యాపారులు కాగా, 303మంది సీఎల్ 4 క్లబ్‌లు, సీఎల్ 6 స్టార్‌హోటళ్ళ లైసెన్సులు 94, సీఎల్ 7 హోటళ్లు, బోర్డింగ్‌లు 3030, సీఎల్ 9 బార్ అండ్ రెస్టారెంట్ 3,642, ఎంఎస్ఐఎల్ స్టాల్‌లు 1077 ఉన్నాయి.

లైసెన్సు	ప్రస్తుతఫీజు	పెంపు
సీఎల్ 6 (స్టార్ హోటళ్లు)	9,75,000	23,00,000
సీఎల్ 7 (హోటల్ అండ్ బోర్డింగ్)	9,75,000	19,55,000
సీఎల్ 9 (బార్ అండ్ రెస్టారెంట్)	8,62,000	17,25,000

మిలిటరీ మద్యంపైనా పన్ను..!

రాష్ట్రంలో మిలిటరీ క్యాంటీన్‌లలో విక్రయించే మద్యంకు పన్ను వేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రక్షణశాఖ ఆధ్వర్యంలో క్యాంటీన్‌స్టోర్ విభాగం ఆర్మీ క్యాంటీన్‌లను తెరిచింది. ఇక్కడ లభించే మద్యానికి పన్ను మినహాయింపు ఉన్నందున తక్కువ ధరకే ఫుల్‌బాటిళ్లు లభ్యమవుతాయి. దేశవ్యాప్తంగా 3,700కు పైగా మిలిటరీ క్యాంటీన్ స్టోర్లు ఉండగా రాష్ట్రంలో 72 ఉన్నాయి. సాధారణంగా కొనుగోలు చేసే మద్యానికి మిలిటరీ క్యాంటీన్ మద్యానికి సుమారు 30-40శాతం వ్యత్యాసం ఉంటుంది. మిలిటరీ క్యాంటీన్‌లకు కొంతమేర పన్ను పెంచాలనే ప్రతిపాదనను ఉంచారు. కొన్ని రాష్ట్రాలు వ్యాట్‌ను విధిస్తున్నాయి. మిలిటరీ క్యాంటీన్‌లలో లభ్యమయ్యే మద్యాన్ని కొందరు బయట సాధారణ రేట్లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయినా రాష్ట్రంలో ప్రత్యేకించి బెంగళూరు, బెళగావి, హుబ్బళ్ళి, ధారవాడ ప్రాంతాలలో పలు మిలిటరీ క్యాంప్‌లు ఉన్నాయి. ప్రత్యేకించి బెంగళూరులో 3 విభాగాలకు చెందిన శిక్షణా సంస్థలు ఉన్నాయి. వేలాదిమంది రక్షణశాఖ సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వం పన్ను విధించేందుకు వారు అంగీకరించడం అంత సులువు కాదనిపిస్తోంది.



చిన్నబోయిన అభిమానులు...!

● చిన్నస్వామి స్టేడియాన్ని ముంచేసిన వరుణుడు
● ఐపీఎల్ పునఃప్రారంభ మ్యాచ్ రద్దు
● జనసంద్రమైన స్టేడియం.. భారీ బందోబస్తు


జోరుగా కురుస్తున్న వర్షం

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ పునరారంభంలో భాగంగా తొలి మ్యాచ్ బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ, కోల్కత్తా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరగాల్సి ఉంది. శనివారం సాయంత్రం నుంచే చిన్నస్వామి స్టేడియంకు భారీగా అభిమానులు తరలివచ్చారు. విరాట్‌కోహ్లి టెస్ట్‌మ్యాచ్‌లకు గుడ్‌బై చెప్పిన తరుణంలో అభిమానులు విరాట్‌కోహ్లి 18 వైట్ టీ షర్టులతో తరలివచ్చారు. అయితే భారీ వర్షం రావడంతో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. అభిమానులు కాస్త నిరుత్సాహం చెందారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిమ్యాచ్ కావడంతో అభిమానులు ఉత్సాహంగా స్టేడియానికి వచ్చారు. స్టేడియం చుట్టూ ఉదయం నుంచే బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రానికి వెయ్యిమందికిపైగా పోలీసులు భద్రతా విధులను పర్యవేక్షించారు.



వర్షంలోనూ వేచియున్న అభిమానులు

గ్రేటర్ బెంగళూరుకు వ్యతిరేకంగా పోరాటం

● బీబీఎంపీకి ఎన్నికలు నిర్వహించండి : కన్నడ పోరాటనేత వాటాళ్ నాగరాజ్

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని కన్నడ పోరాట నేత వాటాళ్ నాగరాజ్ పేర్కొన్నారు. శనివారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు నగరానికి ప్రతిపాదించినట్టుగా ఒక్కరే మేయర్ చాలు అని, ముగ్గురు మేయర్‌లు వద్దన్నారు. అవసరమైతే ప్రజలతో కలసి పోరాటం చేసి బెంగళూరు బంద్ చేస్తామని, జైలుకు వెళ్లేందుక కూడా సిద్ధమన్నారు. గ్రేటర్ బెంగళూరు కోసం కర్ణాటక ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిందన్నారు. అంతకుముందు బీబీఎంపీ, నగరసభ ఉండేదన్నారు. 1964, 73లలో నగరసభలో సభ్యుడిగా ఉండేవాడినన్నారు. గ్రేటర్ బెంగళూరు అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. గ్రేటర్ బెంగళూరు వల్ల సమస్యలు తప్పవన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షుడిగాను, ఉపముఖ్యమంత్రి ఉపాధ్యక్షులు అవుతారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఏది అధికారంలో ఉన్నా తమకు సంబంధం లేదని, స్థానిక ప్రజాప్రతినిధులు ఉంటే సమస్యలు ఆలకించేవారని ప్రస్తుతం అడిగేవారు లేరన్నారు. బెంగళూరు నగరంలో ఎటుచూసినా గుంతలు ఉన్నాయని, తొలుత గుంతలు మూయాలన్నారు. కనకపుర, రామనగర తదితర ప్రాంతాలను చేర్చడం ద్వారా సమస్యలు పరిష్కారం కావన్నారు. పాలన పేరిట ముగ్గురు మేయర్‌లు ఉండాలనుకోవడం సరికాదన్నారు. నాడప్రభు కెంపేగౌడ రూపొందించిన బెంగళూరు నగరం సమగ్ర అభివృద్ధికి దృష్టి సారించాలన్నారు. ఏళ్ల తరబడి ప్రజాప్రతినిధులు లేకుండా పాలన కొనసాగించడాన్ని తప్పుబట్టారు. వెంటనే బీబీఎంపీకి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బెంగళూరు బంద్‌కు పిలుపునిస్తామన్నారు.


మీడియా సమావేశంలో వాటాళ్‌నాగరాజ్


డ్యామ్ నుంచి విడుదలైన నీటిలో నురగ


8

నురగమయమైన కెలవరపల్లి డ్యామ్

● రసాయనాలతో కలుషితం ● కర్మాగారాల వ్యర్థాలపై రైతుల ఆగ్రహం

ప్రవేశం...నిషేధం..!

● హెబ్బాళ బ్రిడ్జిపై ఐదురోజులు వాహన సంచారానికి ఆంక్షలు


హెబ్బాళ ఫ్లై ఓవర్ (ఫైల్)

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు హైదరాబాద్‌కు వెళ్లే ప్రధానమైన హెబ్బాళ బ్రిడ్జ్‌పై ఐదు రోజులపాటు సంచార నిషేధం విధించారు. శనివారం నుంచి ఈనెల 21న బుధవారం వరకు నిబంధనలు వర్తిస్తాయి. రాత్రి 12 గంటలనుంచి తెల్లవారు 3 వరకు బ్రిడ్జ్‌పై వాహనాల సంచారం సంపూర్ణంగా నిషేధించారు. ప్రత్యామ్నాయంగా ఎయిర్‌పోర్ట్ నుంచి మేఖ్రి సర్కిల్‌కు వచ్చే వాహనాలు ఎస్టీమ్‌మాల్ సర్వీస్ రోడ్డు మీదుగా తుమకూరు వెళ్లే రింగ్‌రోడ్డుపై ప్రయాణించి కువెంపు సర్కిల్ నుంచి బీఈఎల్ కూడలి మీదుగా మేఖ్రి సర్కిల్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఐదు రోజుల సంచార నిషేధాన్ని నగర ప్రజలు గమనించాలని అధికారులు సూచించారు. రాత్రి వేళల్లో విమానాశ్రయానికి వెళ్లేవారు కొంత సమయం ముందుగానే బయల్దేరాల్సి ఉంటుందని వారు సూచించారు. బెంగళూరు అభివృద్ధి ప్రాధికార (బీడీఏ) ద్వారా నిర్వహణా పనులకోసం ప్రయాణంపై ఆంక్షలు విధించారు.

అనుమానాస్పద బోట్లపై అప్రమత్తంగా ఉండాలి

● సముద్రంలో చేపల వేటకు గుంపుగా వెళ్లండి ● మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వివేక్

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపలవేటకు వెళ్ళినప్పుడు అనుమానాస్పద వ్యక్తులు, గుర్తు తెలియని బోట్‌లు కనిపిస్తే వెంటనే అప్రమత్తంగా వ్యవహరించాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వివేక్ ఆర్ పిలుపునిచ్చారు. శనివారం మల్పె ఓడరేవు నుంచి చేపలవేటకు వెళ్లే మత్స్యకారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు పహల్గాం దాడి తర్వాత జరిగిన పరిణామాలను వివరించారు. దేశభద్రత అందరి బాధ్యత అని గుర్తు చేశారు. సముద్రంలో చేపలవేటకు 2-3 బోట్‌లు గుంపుల తరహాలో వెళ్లాలని సూచించారు. రాత్రివేళ వేట సమయంలో, లంగరు వేసినప్పుడు నావిగేషన్ లైట్లను ఆన్ చేసుకోవాలన్నారు. సముద్రంలో రక్షణా సిబ్బంది పరిశీలన చేసినప్పుడు అందరూ సహకరించలన్నారు. అందరూ క్యూఆర్‌కోడ్ ఆధార్ కార్డులను, గుర్తింపుకార్డులను, మత్స్యకారుల లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. ఎటువంటి సంక్లిష్ట పరిస్థితి ఎదురైనా వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సముద్రంలో మన ప్రాంతానికి చెందని విదేశీ బోట్లు కనిపిస్తే వెంటనే ఇండియన్ నేవీ, కోస్ట్ కార్డు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విదేశీయులు వచ్చే అవకాశాలు ఉంటాయని వారిని సముద్రంలోనే తిప్పికొట్టాలంటే మత్స్యకారుల సహకారం ముఖ్యమన్నారు.


ఐల్యాండ్ వద్ద పర్యాటకులు (ఫైల్)

సెయింట్‌మేరీ ఐల్యాండ్‌కు ఆంక్షలు

మల్పెబీచ్‌కు అనుబంధంగా పర్యాటకులకు ఆంక్షలు విధించారు. వర్షాకాలం ప్రారంభమైనందున 4 నెలలపాటు సెయింట్ మేరీస్ ద్వీపంలో ప్రవేశానికి నిషేధాజ్ఞలు అమలులోకి వచ్చాయి. జలసాహసక్రీడలను స్తంభింపచేశారు. సెప్టెంబరు 15వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని జిల్లా యంత్రాంగం ప్రకటించింది. వేసవి సెలవులు ఉన్నందున కొన్నిరోజులపాటు పర్యాటకులకు వెసలుబాటు కల్పించాలనే డిమాండ్ ఉంది.

కొత్త గేట్లతోనే తుంగభద్రం..!

● అరకొర మరమ్మతులు సరికాదు: రైతు సంఘం


వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ,మే 17(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంకు వచ్చే జూలై నాటికి అన్ని గేట్లను కొత్తవి ఏర్పాటు చేయాలని, మరమ్మతులు చేపట్టి అధిక నీరు నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కన్నడ నాడు రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన రైతులు అనంతరం కలెక్టర్ సిబ్బంది ద్వారా సీఎంకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మెనసిన ఈశ్వరప్ప మాట్లాడుతూ తుంగభద్ర ఆనకట్టలో గేట్లు ఏర్పాటు చేసి దాదాపు 72సంవత్సరాలు అయ్యిందని, నాణ్యత కోల్పోయి బలహీనంగా తయారయ్యాయన్నారు. రైతు సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, మరేగౌడ, కార్యదర్శి ప్రహ్లాద్, శివమూర్తి, మంజునాథ్‌గౌడ, రామనగౌడ శంకరప్ప, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

వీరులకు విజయసిందూరం..!



బళ్లారిలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు


బెంగళూరు ర్యాలీలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, బీజేపీ నాయకులు

● ఆపరేషన్ సిందూర సైనికులకు జేజేలు
● రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా తిరంగా యాత్ర
● తరలి వచ్చిన నాయకులు, పిల్లలు, పెద్దలు

పహల్గాంలో హిందువులను టార్గెట్ చేస్తూ కిరాతకంగా హతమార్చిన ఉగ్రవాదుల ఏరివేతకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయంపై సంబరాలు మిన్నంటాయి. ఉగ్రవాదులను మట్టి కరిపించిన జవాన్లకు చిన్నా, పెద్ద తేడా లేకుండా జేజేలు పలుకుతూ కొనియాడారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా పలు పట్టణాలు, గ్రామాల్లో తిరంగా యాత్ర చేపట్టారు. జాతీయ పతాకం చేత బట్టి భారీగా ర్యాలీలు నిర్వహించారు. రహదారులు త్రివర్ణ శోభితంగా మారాయి..

8


ర్యాలీలో స్వామీజీలు, నాయకులు



మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్





గోల్డ్ మెడల్, పీహెచ్‌డీ పొందిన వారి ప్రతిజ్ఞ


స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు, జనం

విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు

సాంకేతిక సవాళ్లను అధిగమించాలి
గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
అట్టహాసంగా జేఎన్టీయూ స్నాతకోత్సవం

అనంతపురం సెంట్రల్, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులే భవిష్యత్ తరాల నిర్మాతలు అని గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. జీరోను కనుగొన్న ఆర్య భట్టు నుంచి భౌతికశాస్త్ర నోబెల్ బహుమతి గెలుచుకున్న తొలి ఆసియావాసి సీవీ రామన్ వరకు భారతదేశం ఆవిష్కర్తల నిలయమని పేర్కొన్నారు. శనివారం జేఎన్టీయూఏలో 14వ స్నాతకోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన రావు అధ్యక్షతన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్నాతకోత్సవానికి యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ విశ్రాంత ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ హాజరయ్యారు. ముందుగా హైదరాబాద్ లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ సత్యనారాయణ చావాకు గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తరువాత 41 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, 40,109 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. వర్తమాన ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, భవిష్యత్తు నిర్మాతలు, నాయకులు మీరేనని విద్యార్థులకు సూచించారు.

వ్యవస్థాపకులుగా రాణించేందుకు సొంత ప్రణాళికలు రూపొందించుకుని దేశానికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారాలను కనుగొడం వ్యవస్థాపక లక్షణాలని తెలిపారు. ఈ అంశానికి దోహదపడేలా అమరావతి హబ్-అండ్ స్పోక్ మోడల్ అనుసంధానంగా జేఎన్టీయూలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ విద్యలో అసాధారణమైన విద్యనందిస్తూ రాష్ట్రంలో జేఎన్టీయూ అగ్రశ్రేణిగా నిలిచిందని అన్నారు. శాస్త్ర, సాంకేతిక సవాళ్లను అధిగమించి, మానసిక సామర్థ్యాన్ని ప్రదర్శించాలన్నారు. మీ అభిరుచుల సాధనలో నిర్భయంగా ఉండాలని, ఏ వైఫల్యం మిమ్మల్ని నిరుత్సాహపరచనివ్వకూడదని హితవు పలికారు. విజయంతో సంతృప్తి చెందవద్దని, వినయంతో ముందుకు నడవాలని, జేఎన్టీయూ ఘనతను చాటాలని విద్యార్థులకు గవర్నర్ పిలుపునిచ్చారు.

విమర్శనాత్మకంగా ఆలోచించాలి
-ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్



జ్ఞానాన్ని పెంపొందించుకోవడమే విద్య ఉద్దేశంకాదని, విమర్శనాత్మకంగా ఆలోచించడం, నైతికంగా వ్యవహరించడం ముఖ్యమని ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ పేర్కొన్నారు. తక్కువతో ఎక్కువ చేయగలమని ఏఐ, చాట్‌జీపీటి నిరూపిస్తున్నాయని వివరించారు. వంద మిలియన్ల వినియోగదారులను చేరుకోవడానికి మొబైల్ ఫోన్‌కు 30 సంవత్సరాలు పట్టిందన్నారు. చాట్‌జీపీటికి రెండు నెలలు మాత్రమే పట్టిందన్నారు. చాట్‌జీపీటిలో 20కి ఒకటో వంతు ఖర్చుతో డీప్ సీక్‌ను చైనా తీసుకువచ్చిందని అన్నారు. తాను మొదటిసారి సివిల్ ఇంజనీర్‌గా పనిచేసే సమయంలో గృహనిర్మాణ ఖర్చులో 80శాతం మెటీరియల్ ఖర్చు, 20 శాతం ఇంటీరియర్ ఖర్చు అయ్యేదన్నారు. నేడు 20 శాతం నిర్మాణానికి, 80 శాతం ఇంటీరియర్‌కు ఖర్చుచేయాల్సి వస్తోందని అన్నారు. ముద్రించిన పుస్తకాన్ని చూడకుండానే ప్రసంగించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత

అనంతపురం అర్బన్ మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పలువురు ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం జేఎన్టీయూ స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు జిల్లాకు వచ్చిన గవర్నర్‌ను స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత జ్ఞాపికను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్‌లాల్, కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ పాల్గొన్నారు.

జేఎన్టీయూకు న్యాక్, ఎన్‌బీఏ ర్యాంకులు

వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు



జేఎన్టీయూకు న్యాక్ ఏ గ్రేడ్‌ను, అన్ని పీజీ ప్రోగ్రామ్‌లకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ నాణ్యత, భద్రత, పర్యావరణం అంశాల్లో ఐఎస్‌ఓ సర్టిఫికేషన్లు పొందామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 801-1000, భారత దేశంలో 25వ స్థానం, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో జేఎన్టీయూఏ నిలిచిందని పేర్కొన్నారు. క్యూఎస్ ఆసియా ర్యాంక్ 651-700, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ 151-200 (ఇంజనీరింగ్), 51-100(స్టేట్ పబ్లిక్) ర్యాంకులు సాధించామని తెలిపారు. వివిధ ఏజెన్సీల నుంచి రూ.367 లక్షలకు పైగా ప్రాజెక్ట్ గ్రాంట్లను పొందామని అన్నారు. ఆవిష్కరణల ఫలితంగా ఈఈజీ ప్రాసెసర్లు, కాంక్రీట్ టెక్నాలజీలు, శక్తి పరికరాలను కవర్ చేసే పేటెంట్లు లభించాయన్నారు. తాజాగా 33 పేటెంట్లను అధ్యాపకులు ప్రచురించారని వివరించారు. డిగ్రీలో ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడంలో నిబద్ధతకు గుర్తింపుగా మేకింగ్ ఇండియా ఎంప్లాయిబుల్ అవార్డు లభించిదని అన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ, ఏఐసీటీఈ విశిష్ట నిపుణులుగా మూడు సంవత్సరాల పదవీకాలానికి గుర్తింపు పొందారన్నారు. అదేవిధంగా పలువురు ప్రొఫెసర్లకు అవార్డులు లభించాయన్నారు. ఈ సంవత్సరం 40,109 డిగ్రీలను ప్రదానం చేశామని, వీటిలో 30,017 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ పూర్తిచేసిన 9,564 మంది విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 361 మందికి ఫార్మా-డి పట్టాలు, 167 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశామని తెలిపారు. మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 41 బంగారు పథకాలను ప్రదానం చేశామన్నారు. వీటిలో 27 పథకాలను మహిళలు సాధించారని, ఇది నారీశక్తికి నిదర్శనమన్నారు. నాలుగు మెడల్స్‌ను పొందిన తయ్యూరు సుప్రజ, ఆరు మెడల్స్‌ను సాధించిన నంద్యాల పూజిల్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

విధుల్లో కలెక్టర్ బిజీబిజీ



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పర్యటను విజయంతం చేసేందుకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మూడురోజుల నుంచి శ్రమిస్తూవచ్చారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంచేస్తూ గర్నర్ పర్యటన ఏర్పాట్లను పూర్తిచేయించారు. శనివారం ఉదయం రైల్వేస్టేషన్‌లో గవర్నర్‌కు స్వాగతం పలికి రోడ్లు, భవనాల అతిథిగృహానికి క్వాన్వాయ్‌తో వెళ్లారు. అక్కడి నుంచి గవర్నర్‌తోపాటే జేఎన్టీయూ స్నాతకోత్సవానికి వచ్చారు. కాన్వొకేషన్ ప్రారంభంకాగానే గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదికను అలకరించారు. అనంతరం కలెక్టర్ తన ల్యాప్‌టాప్ ద్వారా ఈఆఫీస్ వంటి కార్యకలాపాల విధుల్లో నిమగ్నమయ్యారు.

పటిష్ట బందోబస్తు...

జేఎన్టీయూ స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. గత రెండు స్నాతకోత్సవాలకు జిల్లాకు వచ్చిన సందర్భంకంటే ఈ సారి బందోబస్తు పెంచారు. దాదాపు 1.30 గంటల సేపు గవర్నర్ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. నిమిషం ఆలస్యం చేయకుండా ప్రణాళికబద్ధంగా కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

'పట్ట'రాని సంబరం...!



జేఎన్టీయూ స్నాతకోత్సవంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఎన్టీఆర్ ఆడిటోరియం సంబరాలతో మునిగిపోయింది. సంవ్సతరాల తరబడి చదివిన ఫలితంగా గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు చేతుల మీదుగా పట్టాలను అందుకున్న వేళ ఆనందంతో పులకించిపోయింది. డిగ్రీలను చేత బట్టుకుని వెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. మెడల్స్‌ను సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి బంగారు పతకాలను ముద్దాడుతూ మురిసిపోయారు. ప్రతిభకు తగిన గౌరవాన్ని ఇచ్చిన జేఎన్టీయూ.. జీవితకాలం స్థిరంగా నిలిపోయే అనుభూతిని ప్రసాదించిందని ఆనందాలను పంచుకున్నారు.



పూజిత కుమార్ రెడ్డికి పతకం బహుకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్


షేక్ షాజిద్ మురద్ | సబియా సుల్తానా | మొహ్మద్ అక్రమ్ | వెంకట కార్తీక్ | రమ్యలక్ష్మి | లక్ష్మిప్రియ | అఖిల | నాగమణి | భవిత


నాగేంద్రబాబు | హర్షిత | అభినయన | లికితరెడ్డి | వాల్మీకి హరిత | ఫాహిద్ అలి | వనతి | శ్రీవైష్ణవి | తయ్యూరు సుప్రజ | జాహ్నవి | సునీత | అమృత్‌బాబు


భవ్యశ్రీ | మహిత | గ్లిసియ | వాసంతి


పీహెచ్‌డీలు సాధించిన విద్యార్థులకు పట్టాల ప్రదానం

సైనికులకు బాసటగా
నిలుద్దాం

- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాం
- రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్
- అనంతలో భారీ తిరంగా ర్యాలీ



ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ


మేము సైతం...



జాతీయ జెండాలతో భారీర్యాలీ →



ఆర్ట్స్ కళాశాల మైదానంలో మాట్లాడుతున్న మంత్రి కేశవ్



అనంతపురం అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): సైనికుల శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుద్దామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా అనంతపురం నగరంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. శనివారం ఉదయం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న మైదానం నుంచి క్లాక్ టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ సమీపంలోని జెండా స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ప్రజా సంఘాల నాయకులు, మాజీ సైనికులు, విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, టీచర్లు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో భాగస్వాములయ్యారు. ర్యాలీ పొడవునా జాతీయ జెండాలు రెపరెపలాడాయి. సప్తగిరి సర్కిల్ సమీపంలో జాతీయ జెండా స్తంభం వద్ద జాతీయ గీతాలాపన చేసి ర్యాలీని ముగించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంటకశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఇతర ప్రజాప్రతినిధులు తిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాను చేతపట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ పెద్ద ఎత్తున నినదించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, డీవీఈఓ వెంకటరమణానాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఎంహెచ్ఓ దేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు సరిపూటి సూర్యనారాయణ, ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం, బాంబే డయింగ్ నాగన్న, రాయల్ మురళీ, సింగవరం రవి, గంగారామ్, తలారి ఆదినారాయణ, దండు శ్రీనివాసులు, తెలుగు మహిళలు స్వప్న, సంగా తేజస్విని, చరిత తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ గర్వకారణం

దేశ సరిహద్దుల్లో ప్రాణాలను అడ్డేసి నిలిచిన సైనికులకు, సైనిక శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుస్తూ దేశం మొత్తం తిరంగ ర్యాలీ జరుపుకోవడం గర్వకారణం. దేశం ఒక్కటే అన్న విషయం మన గుండెచప్పుడని ఈ రోజు అర్థం అవుతోంది. ఇంత ఉదయాన్నే వేలాది మంది ర్యాలీకి హాజరయ్యారంటే దేశభక్తి ప్రతి ఒక్కరి గుండె చప్పుడుగా మారిందనేందుకు ఇదే నిదర్శనం. గోరంట్ల మండలానికి చెందిన వీరజవాన్ మురళీనాయక్ యుద్ధంలో ప్రాణాలు అర్పించారు. సైనికులకు బాసటగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో తిరంగ ర్యాలీలో మనం అందరం భాగస్వామ్యులం కావడం గర్వించదగ్గ విషయం.

- పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖ మంత్రి

సిందూర్‌తో పాకిస్థాన్‌కు సమాధానం



పహల్గాం ఉగ్రదాడిలో అమాయకులైన పర్యాటకులపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు 26 మందిని పొట్టనబెట్టుకున్నారు. ఈ ఘటనతో దేశమంతా బరువెక్కింది. ప్రతి భారతీయుడి కళ్లు ఎరుపెక్కాయి. మనందరి మనోభావాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా మన సైన్యం, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గట్టిగా సమాధానం చెప్పారు. మనదేశంలో అమాయకులపై దొంగ చాటుగా దెబ్బతిస్తే. మనం ముందుగానే చెప్పి ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశాం. మురళీ నాయక్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోతే మనమంతా అంత్యక్రియల్లో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించామన్నారు.

- సత్యకుమార్ యాదవ్, వైద్యఆరోగ్య శాఖ మంత్రి

మనమంతా అండగా ఉన్నాం



ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీని చేపట్టాం. నగర ప్రజలు, మహిళలు, యువత, ఎన్జీవోలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, వ్యాపార సంస్థలు, టీచర్లు, అన్ని వర్గాలు స్వచ్ఛందంగా తిరంగా ర్యాలీలో భాగస్వామ్యులు కావడం గర్వకారణం. ఈ ర్యాలీలో పాల్గొనడం ద్వారా సైనికులకు మనమంతా అండగా ఉన్నామని తెలియజేశాం.

- వినోద్‌కుమార్, కలెక్టర్

పాకిస్థాన్‌కు దీటుగా సమాధానం



పహల్గాం దాడిని నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాదులకు మన సైన్యం దీటుగా సమాధానం చెప్పింది. భవిష్యత్‌లో ప్రపంచ పటంలో మీ పేరు కూడా లేకుండా చేస్తామనే రీతిలో మన సైన్యం పాకిస్థాన్‌కు సమాధానం చెప్పింది. భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని ప్రపంచ దేశాలకు తెలియజేశారు.

- లక్ష్మీనారాయణ, ఎంపీ

మనసైన్యం సత్తా చాటింది




పహల్గాం తరహాదాడులు పునరావృతమైతే ఆపేరేషన్ సిందూర్ లాంటివి కూడా పునరావృతమవుతాయని మన సైన్యం చేతల్లో చూపించింది. దేశ ప్రజల తరఫున సైన్యానికి సెల్యూట్ చేస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌తో మన ఆర్మీ శక్తి ఏంటో ప్రపంచానికి తెలిసింది. పాకిస్థాన్ పౌరులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ఉగ్రవాదులే లక్ష్యంగా మన సైన్యం దాడులు చేసింది.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

హెచ్‌డీ దేవెగౌడ (పుట్టినరోజు)




దేశ 11వ ప్రధానిగా వ్యవహరించిన హెచ్‌డీ దేవేగౌడ (హరదన హళ్ళి దొడ్డేగౌడ దేవెగౌడ) 1933 మే 18న హసన్ జిల్లా హొళె నరసీపుర తాలూకా హరదన హళ్ళిలో జన్మించారు. జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) పార్టీ జాతీయ అధ్యక్షులు. 1994-96 మధ్య కర్ణాటక సీఎంగా, 1996-97ల మధ్య పీఎంగా వ్యవహరించారు. కేంద్ర హోం మంత్రిగా, కర్ణాటక ముఖ్యమంత్రిగా వివిధ హోదాలలో కొన సాగారు. 1960 నుంచి రాజకీయాల్లో ఉంటూ కురు వృద్ధుడిగా పేరొందారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొన సాగుతున్నారు. ఆయన కుటుంబ సభ్యులు రాజకీయాల్లో ఉంటూ పలు హోదాలలో ఉన్నారు.

సిజర్ నికొలస్ 2 (జయంతి)




రష్యాదేశ చివరి చక్రవర్తి నికొలస్-2 పలు ఆర్థిక, రాజకీయ సంస్కరణలు తీసుకొచ్చారు. 1868 మే 18న జన్మించారు. 1894 నుంచి 1917వరకు పాలించారు. మానవహక్కులు, విద్యా కార్యక్రమాలతో సమాజంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. చక్రవర్తిగా ఎంతో గుర్తింపు పొందారు. 1918 జూలై 17న హత్యకు గురయ్యాడు.

బెర్ట్రాండ్ రస్సెల్ (జయంతి)



నోబెల్ పురస్కార గ్రహీత బెర్ట్రాండ్ రస్సెల్ 1872 మే 18న యునైటెడ్ కింగ్‌డమ్‌లో జన్మించారు. తత్వవేత్త, తార్కికుడు, గణితశాస్త్రవేత్త, చరిత్రకారుడు, రచయిత, సంఘ సంస్కర్త, రాజకీయనేత. నాస్తికుడైన ఆయన 'వై ఐయామ్ నాట్ ఏ క్రిస్టియన్' అనే గ్రంథం ఎంతోమందిని ప్రభావితం చేసింది. హైడ్రోజన్ బాంబును పగులగొట్టి పరీక్ష చేసినప్పుడు ఆయన తన రేడియో ప్రసంగంలో దానిని విమర్శించారు. 'మానవుడిని, మానవతను మరిచిపోవద్దు. అట్లా చేయగలిగితే స్వర్గానికి నిచ్చెనలు వేయబడతాయి.' అణ్వస్త్రధారణ నిరాశోద్యమ ప్రారంభానికి సహాయపడ్డారు. 1970 ఫిబ్రవరి 2న తన 97వ యేట కన్నుమూశారు.

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు (జయంతి)



చారిత్రక పరిశోధకుడు, తెలుగులో తొలి విజ్ఞాన సర్వస్వ సృష్టికర్త కొమర్రాజు వెంకట లక్ష్మణరావు 1877 మే 18న కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులో జన్మించారు. 'విజ్ఞానచంద్రికా మండలి' స్థాపకుడు. తెలుగువారికి చరిత్ర పరిశోధనలు పరిచయం చేసి ఉన్నత ప్రమాణాలతో చరిత్ర, విజ్ఞాన రచనలను తెలుగులో అందించడానికి శ్రీకారం చుట్టిన ఉత్తమ విజ్ఞానవేత్త. నవయుగ వైతాళికులలో ఒకరిగా పరిగణిస్తారు. 46ఏళ్లకే మరణించినా తన కొద్దిపాటి జీవితకాలంలో ఒక సంస్థకు సరిపడా పనిని సాకారం చేసిన సాహితీ కృషీవలుడు. సాహితీమూర్తులకు ఆయన సహచరుడు, ప్రోత్సాహకుడు, స్ఫూర్తిప్రదాత. 1923 జూలై 14న కన్నుమూశారు.

పోప్ జాన్‌పాల్ -2 (జయంతి)



క్యాథలిక్ చర్చ్ ముఖ్యులు, వాటికన్ సిటీ క్రైస్తవ గురువు, బిషప్ పోప్ జాన్‌పాల్-2 ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఆయన 1920 మే 18న పోలెండ్‌లో జన్మించారు. 1978 నుంచి 2005వరకు సుదీర్ఘకాలం కొనసాగారు. 16వ శతాబ్దం నుంచి నాన్-ఇటాలియన్ పోప్‌గా గుర్తింపు పొందారు. ప్రపంచవ్యాప్తంగా 129 దేశాలను పర్యటించి శాంతికోసం పాటుపడ్డారు. 2005 ఏప్రిల్ 2న కన్నుమూశారు.

సీఆర్ సుబ్బరామన్ (జయంతి)



సీఆర్ సుబ్బరామన్ 1916 మే 18న తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి ప్రాంతంలో జన్మించారు. సీఎస్ రామ్‌గా పేరొందారు. దక్షిణాదిన సినీ సంగీత దర్శకుడు, నిర్మాత. ఆయన పూర్వీకులు ఆంధ్ర ప్రదేశ్‌లోని కృష్ణాజిల్లావాసులు. పదేళ్లపాటు తెలుగు, తమిళ సినిమాలలోనూ రాణించి సంగీతంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారు. ఘంటసాల వెంకటేశ్వరరావు, విశ్వనాథన్, రామమూర్తి, ఆర్ఎస్ గోవర్ధనం తదితరులు ఆయనవద్ద సంగీతంలో సహాయ దర్శకులుగా పని చేసి కాలక్రమంలో ఎంతో పేరొందారు. దేవదాసు, రత్నమాల, చెంచులక్ష్మి, బాలరాజు, లైలా-మజ్ను వంటి సినిమాలు నిర్మించారు. 1952 జూన్ 27న కన్నుమూశారు.

చలం (జయంతి)



చలం 1929 మే 18న పాలకొల్లులో జన్మించారు. 1950-80ల మధ్య ప్రముఖ తెలుగు సినీ నటుడు. కథానాయకుడిగా, హాస్యనటుడిగా, సహాయ నటుడిగాను రాణించారు. అంతేకాక నిర్మాత, ఆర్ట్ డైరెక్టర్, సెట్ డైరెక్టర్‌గా సత్తా చాటుకున్నారు. విభిన్న పాత్రలలో నటించి గుర్తింపు పొందారు. దాసి, సారంగధర, లంబాడోళ్ళ రాందాసు, సంబరాల రాంబాబు, మట్టిలో మాణిక్యం వంటి సినిమాలు పేరొందాయి. జాతీయ సినీ అవార్డు పొందారు. 1989 మే 4న కన్నుమూశారు.

విద్యుత్‌షాక్‌తో ఉద్యోగి మృతి

ముళబాగిలు, మే 17(ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్‌తీగ తగిలి రవాణాశాఖ ఉద్యోగి మృతి చెందాడు. ముళబాగిలు తాలూకా రాజేంద్రహళ్ళిలో చోటు చేసుకుంది. రెడ్డెప్ప (58) శనివారం ఉదయం బైక్‌పై తోటకు వెళ్తుండగా గత రాత్రి కురిసిన వర్షంతో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్‌తీగలు రోడ్డుపై అడ్డంగా పడిన విషయాన్ని గుర్తించలేదు. రెడ్డెప్ప కేఎస్ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్నారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. సమాచారం అందుకున్న బెస్కాం సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ముళబాగిలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఉద్యోగి ఆకస్మిక మృతిపై పలువురు విచారం వ్యక్తం చేశారు.

బమూల్ ఎన్నికల్లో డీకే సురేశ్ నామినేషన్

బెంగళూరు, మే 17(ఆంధ్రజ్యోతి): బెంగళూరు పాల ఉత్పత్తిదారుల సంఘాల సమాఖ్య (బమూల్) కనకపుర డైరెక్టర్ పదవి కోసం మాజీ ఎంపీ డీకే సురేశ్ నామినేషన్ దాఖలు చేశారు. బమూల్ ఎన్నికలకు తేదీ ఖరారు కావడంతో శనివారం ఆయన నామినేషన్ వేశారు. దాదాపు ఏడాదికాలంగా రాజకీయ పదవులకు దూరంగా ఉంటూ వచ్చిన డీకే సురేశ్ ఒక పాలసమాఖ్య డైరెక్టర్ స్థానానికి నామినేషన్ వేయడం చర్చనీయాంశమైంది. డీసీఎం, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న డీకే శివకుమార్ తమ్ముడు డీకే సురేశ్ రెండుసార్లు బెంగళూరు గ్రామీణ ఎంపీగా కొనసాగారు. 2024 ఎన్నికల్లో ఓటమి చెందడంతో వెంటనే ఎన్నికల్లో పోటీ చేసేది లేదని స్పష్టం చేశారు. రామనగర ఎమ్మెల్యే స్థానానికి ఉప ఎన్నికల్లో పోటీకి ససేమిరా అన్నారు. అయితే కనకపుర పాల సంఘం డైరెక్టర్ స్థానానికి పోటీ చేయడం ద్వారా బమూల్ అధ్యక్షస్థానంపై కన్నువేసినట్టు తెలుస్తోంది.



నామినేషన్ సమర్పిస్తున్న డీకే సురేశ్

వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం

బాగేపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురసభ పరిధిలోని 9వ వార్డు సెవెన్‌హిల్స్ పాఠ శాల ముందున్న వరసిద్ధి వినాయక దేవాలయ 14వ వార్షికోత్సవం జరిగింది. శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆదిశేషప్ప అజయ్, సుజయ్, సుధీంద్ర, రంజిత్ స్వామిల నేతృత్వం లో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. కళశ స్థాపన, గంగాపూజ, గణపతిపూజ, నవగ్రహ పూజ, హోమాదికాలు నిర్వహించారు. మహా మంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా ఆదివారం మంగళవాయిద్యాల నడుమ వెండిరథం ముత్యాల పల్లకీలో స్వామివారి ఊరేగింపు కొన సాగనుంది. కళాకారులు కీలుగుర్రాలు, గారడీ బొమ్మలు, కోలాటం, వాద్యగోష్ఠి, సాంస్కృతి కార్యక్రమాలు జరగనున్నాయి. దేవాలయ సమితికి చెందిన ఏజీ సుధాకర్, అప్పయ్యబాబు, వెంకటేశ్, బీఎన్ గోపాల, ఆదినారాయణప్ప, శ్రీనివాస్, మంజునాథలు పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అలంకరనలో వరసిద్ధి వినాయకుడు

చింతామణి తాలూకాలో భారీ వర్షం



కన్నంపల్లి చెరువులో చేరిన నీరు

చింతామణి, మే 17 (ఆంధ్రజ్యోతి): చింతామణి తాలూకా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి, శనివారాలలో జోరువర్షం కురవడంతో చెరువులు, కుంటలలోకి కొంతమేర నీరు చేరింది. దీంతో గ్రామీణ ప్రాంతాలలో నీటికొరత తాత్కాలికంగా పరిష్కారమైందని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే తోటలలోని పంటలకు కొంతమేర నష్టం వాటిల్లింది. ముంగానహళ్ళి హోబళిలో ఎక్కువవర్షం నమోదైంది. తాలూకాలోని కైవార, అంబాజిదుర్గ హోబళి, పట్టణ, చుట్టుపక్కల ప్రాంతాలలో వర్షం కురవడంతో టమోటా, మల్బరీ తోటలు జలావృతం కావడంతో పంటలకు నష్టం వాటిల్లింది. రెండు రోజులుగా పట్టణంలో ఒక మోస్తరు వర్షం కురవడంతో ఎండవేడిమినుంచి కొంత ఉపశమనం లభించినట్టయ్యింది. కాగా కొన్నిచోట్ల గుంతలపై వర్షపునీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం నెలకొంది. ప్రధానంగా పట్టణానికి తాగునీరు అందించే కన్నంపల్లి చెరువుకు రెండు రోజుల వర్షంతో కొంతమేర నీరు చేరడంతో చుట్టుపక్కల బోరుబావులలో నీటిమట్టం పెరగనుందని నగరసభ అధికారులు అభిప్రాయపడ్డారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడ్డాం



గ్రామసభలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని, తాలూకాలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మావళ్ళి గ్రామంలో శనివారం ఏర్పాటైన గ్రామసభను ఉద్దేశించి ప్రసంగిస్తూ హరటి నుంచి బంగారపేట మెయిన్‌రోడ్డు వరకు రోడ్డు నిర్మించేందుకు రూ.7కోట్లు మంజూరైందన్నారు. వాదాండహళ్ళి, కామానండహళ్ళి, ఐతాండహళ్ళి నుంచి యలబుర్గి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరైందని నిర్మాణపనులు ప్రగతిదశలో ఉన్నాయన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. అన్ని గ్రామాలను అనుసంధానం చేసే రోడ్లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. శుద్ధ తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అమలు చేసేబాధ్యత అధికారులపై ఉందన్నారు. పేద ప్రజలకు పథకాల ప్రయోజనం దక్కాల్సి ఉందన్నారు. కాగా భారతసైన్యం పట్ల, ఆపరేషన్ సిందూర్ గురించి నిర్లక్ష్యంగా కొందరు వ్యాఖ్యానించడాన్ని పత్రికలలో చూశానన్నారు. మన భారతీయ సైనికులను అవమానించరాదని స్పష్టం చేస్తూ పేరు చెప్పకుండానే ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్‌కు బదులిచ్చారు. సమావేశంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సుప్రియా అమరేశ్, ఉపాధ్యక్షురాలు జయమ్మ, ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు ఎస్ నారాయణగౌడ, స్థానిక ప్రముఖులు అశ్వథ్‌గౌడ, రవి, చౌడేగౌడ, నారాయణస్వామి, మునిస్వామిగౌడ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే

రాయచూరు, మే 17(ఆంధ్రజ్యోతి) : సమాజంలోని అన్ని వర్గాల కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రూరల్ ఎమ్మెల్యే వాల్మీకి అభివృద్ధి మండలి చైర్మన్ దద్దల బసనగౌడ అన్నారు. కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా సంచార వైద్యశాలలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు కేటాయించిన సంచార వైద్యశాలను శనివారం నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వద ఆయన ప్రారంభించారనీ సందర్భంగా మాట్లాడిన డీహెచ్‌ఓ జిల్లాకు మూడు సంచార వైద్య శాలలు మంజూరైయ్యాయని ప్రధానంగా భవన నిర్మాణ కార్మికులకు తాము పని చేసే ప్రదేశాల్లోనే అవసరమైన వైద్యసేవలందించేందుకు వీటిని వినియోగిస్తామన్నారు. అదే సమయంలో కార్మికులు ఎక్కడ ప్రమాదాలకు గురైనా అనారోగ్యం బారిన పడినా వారు ఉన్న చోటాకే వెళ్లి వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం సంచార వైద్య శాలలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.



సంచార వైద్య శాలలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

శ్రీరామ శోభాయాత్రపై శాంతిసభ

శిడ్లఘట్ట, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 25న శ్రీరామశోభాయాత్ర నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో శనివారం శాంతిసభ నిర్వహించారు. వివిధ మతాల ప్రముఖులు పాల్గొన్నారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ తొలినుంచి హిందూ-ముస్లింల మధ్య శాంతి సౌహార్ద్రత ఉందన్నారు. శోభాయాత్ర నేపథ్యంలో పట్టణంలోని ప్రముఖ రహదారులపై వాహనరద్దీ తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.



శాంతిసభలో పాల్గొన్న స్థానిక ప్రముఖులు

భక్తిశ్రద్ధలతో సంకష్టచతుర్థి పూజలు

శిడ్లఘట్ట, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోక్‌రోడ్డులో కొలువైన ద్విముఖ గణపతి ఆలయంలో సంకష్టచతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు హోమాలు, ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ శుద్ధి అనంతరం స్వామివారికి అభిషేకం, అలంకరణ నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో పూజ, ధూపదీప నైవేద్యేలు సమర్పించారు. సహస్ర గణపతి హోమం, సాయంత్రం చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం సంకష్టచతుర్థి పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు, మహిళలు కూడా పాల్గొని పాటలు ఆలపించారు. రాత్రి 8.30 గంటలకు మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నసంతర్పణ నిర్వహించారు. ప్రతినెలా ఇక్కడి ద్విముఖ ఆలయంలో సంకష్టచతుర్థికి విశేషపూజలు నిర్వహిస్తుండడంతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. విద్యార్థులు సైతం పాల్గొని వినాయకుడి కృపకుపాత్రులు అవుతున్నట్టు తెలిపారు.



ద్విముఖ గణపతికి విశేష అలంకరణ


అర్థవంతంగా బుద్ధ జయంతి



స్థానిక ప్రముఖులకు ఆత్మీయసత్కారం

దొమ్మసంద్ర, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర గ్రామంలోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ విద్యాసంస్థ ఆవరణలో పద్మావతి బిల్డర్స్ యువ నాయకుడు న్యాయవాది రాకేశ్ నేతృత్వంలో భగవాన్ బుద్ధ జయంతిని అర్థవంతంగా నిర్వహించారు. ఇదే సందర్భంగా 2024-25 వార్షిక ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. వారి తల్లిదండ్రులనుకూడా ఆత్మీయంగా సన్మానించారు. మంజుళా, బీఎస్పీ మంజునాథ్, రాకేశ్‌లు మాట్లాడుతూ గురువులు, పెద్దలు మనకు చక్కటి విద్యను అందించారన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. ఎస్ఎస్ఎల్‌సీలో 90-99శాతం మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉన్నతవిద్యలోనూ రాణించాలని అభిలషించారు. సెయింట్ ఫెలోమినాస్ విద్యాసంస్థ సంస్థాపక కార్యదర్శి చంద్రయ్యనాయుడు, జాతీయ యువ పురస్కార గ్రహీత నాగవేణి, కేపీసీసీ బెంగళూరు దక్షిణ జిల్లా కాంగ్రెస్ సమితి ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు చెలువరాజ్, అంబేడ్కర్ సేవారత్న ట్రస్టు సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జీ మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

21న గంగాభవాని జాతర దీపోత్సవం



నిమ్మకాయల అలంకరణలో అమ్మవారు

చింతామణి, మే 17(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర, కోలారు జంట జిల్లాల్లో ఇంటి దేవతగా పేరొందిన చింతామణి నారసింహపేట ఆదిదేవత గంగాభవాని అమ్మవారి 22వ వార్షిక గంగజాతర నేపథ్యంలో ఈనెల 21న బుధవారం దీపోత్సవం జరగనుంది. అంతకు ముందు ఈనెల 20న మంగళవారం అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం నుంచి తెల్లవారు వరకు పలు లేఅవుట్‌లలో అమ్మవారి ఊరేగింపు కొన సాగనుంది. గంగజాతర నేపథ్యంలో మంగళ, శుక్రవారాలు చేరి మూడు రోజులపాటు తృణముద్ద నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి విశేషంగా నిమ్మకాయల హారాలతో అలంకరించారు. జాతరలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

23న సిడేదహళ్లిలో వేంకటరమణస్వామి ప్రతిష్ఠాపన

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగసంద్ర సమీపాన సౌందర్యనగర్ సిడేదహళ్ళిలో ఈనెల 23న వేంకటరమణస్వామి ప్రతిష్ఠాపన, బ్రహ్మకళశ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త సౌందర్యమంజప్ప తెలిపారు. శనివారం నుంచి 23వరకు నిరంతరంగా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19న పెజావర పీఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజీ పాల్గొంటారన్నారు. పూర్ణప్రజ్ఞ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ ఆచార్య ధార్మిక ప్రసంగం చేస్తారన్నారు. మోహనదాస స్వామిజీ మాణీల స్వామి భక్తులకు ఆశీర్వచనం చేస్తారన్నారు. 21న ధార్మికసభ కార్యక్రమాలు జరుగుతాయని, డీసీఎం డీకే శివకుమార్, దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి పాల్గొంటారన్నారు. 23న బ్రహ్మకళశోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థస్వామిజీ నేతృత్వంలో కొనసాగుతుందన్నారు.

ఎలక్ట్రిక్ కార్లకు పెరిగిన ఆదరణ

బెంగళూరు, మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరుగుతోంది. కొన్నేళ్లుగా ద్విచక్రవాహనాల మార్కెట్ ఉత్సాహంగా సాగగా ఇటీవల కార్ల కొనుగోలుకు సైతం ఆసక్తి చూపుతున్నట్టు జుబిలెంట్ మోటర్స్ సీఈఓ అమిత్‌జైన్ ప్రకటించారు. ఈనెల 5న దేశీయ మార్కెట్‌లోకి వచ్చిన ఎంజీ విండర్స్ ప్రొ కారు పదిరోజుల్లోనే 150 యూనిట్లు డెలివర్ చేసినట్టు తెలిపారు. విడుదలైన 24 గంటల్లోనే 80వేల బుక్కింగ్స్ జరిగాయన్నారు. ఎలక్ట్రికల్ కార్ల పట్ల ప్రజలు ఆసక్తి చూపడం సంతోషకరమన్నారు.


కోరమంగల హోటల్‌లో కన్నడిగులకు అవమానం

» అదుపులో మేనేజర్, సిబ్బంది

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోరమంగలలో నెక్సస్ మాల్ ఎదురుగా ఉండే జీఎస్ సూట్స్ హోటల్‌లో కన్నడిగులను హేళన చేసేలా అసభ్య పదాలతో డిస్‌ప్లేలో ప్రచారం చేశారు. శుక్రవారం రాత్రి కన్నడిగులను అవమానపరిచేలాంటి వ్యాఖ్యలతో డిస్‌ప్లేలో ప్రచారం సాగింది. ఓ యువకుడు వీడియో తీసి పోస్ట్ చేయడంతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే మడివాళ పోలీసులు శనివారం అక్కడికి చేరుకుని డిస్‌ప్లే బోర్డును స్వాధీనం చేసుకున్నారు. మేనేజర్, సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ హోటల్‌ను నౌషాద్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం అతను కేరళలో ఉన్నట్టు పోలీసులు గుర్తిం చారు. ఎల్ఈడీ బోర్డును హ్యాక్ చేసి తప్పుగా ప్రచారం చేశారని నౌషాద్ వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది.

సమాజ నిర్మాణ పోరాటం నిరంతరం సాగాలి

రాయచూరు, మే 17(ఆంధ్రజ్యోతి) : శక్తివంతమైన దేశ నిర్మాణం, ఉత్తమ సమాజ నిర్మాణం కోసం సాగే ప్రతి పోరాటం నిరంతరం సాగాలని సామాజిక ఉద్యమకారుడు రామ్ పునియాని ముంబై సూచించారు. శనివారం సింధనూరు నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన అభ్యుదయ సాహిత్య 11వ మేళా శనివారం ప్రారంభమైంది. ప్రధానోపన్యాసం చేసిన రామ్ పుయ్యాని దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహనీయుల ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. అదే సమయంలో అంబేడ్కర్, సర్దార్ భగత్‌సింగ్ ఆశయాల సాధనను నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రజల మధ్య విద్వేషాలు తలెత్తుతుండడం ప్రమాదకరమన్నారు. ప్రజల మధ్య మతపరమైన విద్వేషాలను రచ్చగొట్టే ప్రయత్నానికి ఐక్యతతో అడ్డుగట్ట వేయాలన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ సమాజ ముఖ్య లక్షణమని దాన్ని కాపాడుకోవడం అందరూ బాధ్యతగా గుర్తించాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.08	1,577.57
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1249	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,378	0
నీటి నిల్వ (టీఎంసీలు)	8.05	3.40



చెరువును తలపిస్తున్న కొట్టూరు బస్టాండ్

కొట్టూరులో భారీ వర్షం

బళ్లారిరూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి తాలుకా కొట్టూరులో రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కేఎస్ఆర్టీసీ బస్టాండులో వర్షపు నీటితో జలమయంగా మారి చెరువును తలపించింది. ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఘనంగా మదకరి నాయక జయంతి

సిరుగుప్ప, మే 17(ఆంధ్రజ్యోతి): మదకరి నాయక తత్వ సిద్ధాంతాలను పాటించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎం సతీష్ పిలుపునిచ్చారు. శనివారం సిరుగుప్ప పట్టణంలో వాల్మీకి భవనంలో వీర మదకరి నాయక జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదకరి నాయక చరిత్ర ఎంతో వుందని ఆయన తెలిపారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆయన కృషి చేశారని తెలిపారు. వాల్మీకి సంఘం అధ్యక్షులు నాయక, మల్లయ్య, వెంకటేష్, ఉలిగయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై మెరుపు దాడులు

● మూడు టన్నుల పౌచ్‌ల స్వాధీనం



ప్లాస్టిక్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయచూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం వల్ల ఎదురవుతున్న సమస్యల తీవ్రతను గుర్తించిన మహానగర పాలిక అధికారులు శనివారం నగరంలో పలు చోట్ల ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులో దాదాపు మూడు టన్నులకు పైగా ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవడం గమనార్హం. ఇటీవల నగరంలోని రాజకాలువ(ప్రధాన డ్రైన్)ను శుభ్రం చేసేందుకు కార్యాచరణ చేపట్టిన అధికారులకు టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు లభిస్తుండడంతో అధికారులు నిర్ఘాంతపోతున్నారు. దీంతో స్పందించిన మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మొహపాత్ర, ప్లాస్టిక్ వినియోగం పై మరో సారి ఉక్కుపాదం మోపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన నేపథ్యంలో వాటిని వినియోగించిన వారి పై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమైయ్యారు. వేసవిలో అధికంగా వాటర్ ప్యాకెట్ల విక్రయాలు జరుగుతాయని, ఇలాంటి సమయంలో కల్తీకి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే దాడులు ప్రారంభించిన అధికారులు బాధ్యుల పై మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు చేశారు. మరోసారి పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు

భూమిపూజకు నోచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు

● వర్క్ ఆర్డర్లు ఇచ్చినా స్థలం చూపని ప్రజాపనుల శాఖ ● 25 కేంద్రాల్లో పూర్తయ్యింది ఐదే..



పనులు పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రం

బళ్లారి గాంధీనగర్, మే 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి నిరుపయోగ మవుతున్నాయి. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజక వర్గంలో 'మహత్వ కాంక్ష యోజన' క్రింద, నగర గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించింది. బళ్లారి నగరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న అంగన్‌వాడీల పునర్దురణలో భాగంగా ఎస్సీ, ఎస్టీ ప్రజలు నివసించే ప్రాంతాల్లో 25 కొత్త అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి రూ 5కోట్లు నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు బళ్లారి ప్రజా పనుల శాఖకు అప్పగించింది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ జరపాల్సిన బాధ్యతను పనుల శాఖకు అప్పగించింది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణలకు సంబంధించి టెండర్లు పూర్తి జనవరి నెలలో అర్హులైన కాంట్రాక్టర్లకు వర్క్ ఆర్డర్, అగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తి చేసుకుంది. అయితే ఇప్పటి వరకు ఒక చోట మినహా...ఆరు కేంద్రాల నిర్మాణం పనులు వరకు పునాదుల వరకు పరిమితం కాగా, మిగిలిన 18 ప్రాంతాల్లో నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మహిళా శిశు సంక్షేమ, నగర విభాగం అధికారి మోహనకుమారి వివరాలు అందజేసింది. వర్క్ ఆర్డర్లు ఇచ్చినా ఇంతవరకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వక పోవడం పనులు అనుమానాలకు దారితీస్తోంది. సాధారణంగా స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమిపూజ చేసిన తరువాత పనులు ప్రారంభించడం ఆనవాయితీ...అయితే ఇంతవరకు భూమిపూజలు చేపట్టకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. వర్క్ ఆర్డర్ నిబంధనల ప్రకారం ఆరు నెలలు గడువు ఉంటుంది. అధికారులు ఇచ్చిన గడువు మే నెలతో ఐదు నెలలు పూర్తి అవుతుంది అయితే పనులు ఎందుకు ప్రారంభించలేదని కాంట్రాక్టర్లను అడిగితే... తమకు ఇంతవరకు ప్రజాపనుల శాఖ అధికారులు స్థలాలు చూపించలేదంటే... అంగన్‌వాడీ కేంద్రా లు ఎక్కడ నిర్మించాలని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్లు పనులు చేపట్టాడానికి సిద్ధంగా ఉన్నా స్థలం చూపలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థలాలు చూపించి ఉంటే.. ఇప్పటికే పనులు పూర్తి చేసి అంగన్‌వాడీ కేంద్రాలను అప్పగించే వారమని కాంట్రాక్టర్లు అంటున్నారు. భూమిపూజ పేరుతో అధికారులు కాంట్రాక్టర్లకు ప్రారంభించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సఖ్యత కొరవడిన కారణంగా నిధులు నిర్వీర్యమైపోతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ప్రజా పనుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మేమరాజును ప్రశ్నించగా కట్టడాల నిర్మాణాల పనులు అన్ని ప్రారంభం అయ్యాయని, ఎలాంటి సమస్య లేదని సమాధానమిస్తున్నారు. ఒకవైపు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు 25 అంగన్‌వాడీ కట్టడాల్లో 18 కట్టడాలు ఇంకా ప్రారంభం కాలేదని వివరాలు అందజేసినా.... ప్రజాపనుల శాఖ అధికారులు తప్పును కప్పిపెట్టడం ఆశ్చర్యం. ఈ నెల ఆఖరి నుంచి ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయి... ఈ లోగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు పూర్తి అయ్యింటే బాగుండేదని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు తెలియజేయండి

● కేంద్ర దిశా సమితి సభ్యులు ఏసీ దానప్ప



కంప్లి, మే 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి శాఖ సదుపాయాలు ప్రజలకు సకాలంలో చేరేలా చూడటంలో అధికారుల పాత్ర చాలా ముఖ్యమైనది. కేంద్ర దిశా సమితి సభ్యులు ఏసీ దానప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాఖలకు సంబంధించి 67 ప్రాజెక్టులను అమలు చేయడంలో దిశ సమితి కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే రికార్డులను సమీక్షించడం ఆ శాఖ బాధ్యత ఏదైనా అవకతవకలు లేదా అవినీతి జరిగితే చట్టపరమైన చర్య కోసం దిశ సమితి ఛైర్మన్ సిద్దరామయ్య, గవర్నర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కేంద్రం నిధులను దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. అది పారదర్శకంగా వుంటే లేదా పని సరిగా లేకపోతే క్రమశిక్షణ చర్య కోసం కమిటీ ఛైర్మన్, సీఎం సిద్దరామయ్యకు ఫిర్యాదు నివేదికను సమర్పిస్తాము. ఆశా వర్కర్ల నుండి మధ్యాహ్న భోజనం పథకం వరకు అంగన్‌వాడీ కేంద్రాల నుండి ముఖ్యమంత్రి స్థాయి వరకు ఉద్భవించిన విభాగాల పని పరిధి విస్తరించింది. రైల్వే శాఖ నిర్వహిస్తున్న పనిలో ఏవైనా లోపాలు కనిపిస్తే మీరు ఫిర్యాదు కూడా చేయవచ్చు. టెలిఫోన్ కార్యాలయంలో చందాదారులు ఏవైనా సమస్యలను ఎదుర్కొంటే వారు దాని గురించి తమ గొంతును వినిపించవచ్చు. వృద్ధాప్య పింఛన్ లేదా వితంతు పింఛన్ కోసం తిరుగుతున్నట్లు తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. కంప్లిలో దిశ సమితి కార్యాలయం త్వరలోనే ప్రారంభమవుతుందని ఆయన అన్నారు.

నెలకోసారి ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

● వైద్యాధికారి డాక్టర్ దమ్మూరు బసవరాజు



పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న బసవరాజు

సిరుగుప్ప, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తరచూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని తాలుకా వైద్యాధికారి డాక్టర్ దమ్మూరు బసవరాజు సూచించారు. శనివారం సిరుగుప్ప పట్టణం ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ ఒత్తిడి నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ మనిషికి సోకే వ్యాధులు, రోగులు విషయంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. నెలకొకసారి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో వైద్యులు డాక్టర్ ప్రశాంత్, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వివేకానంద పాల్గొన్నారు.

విపత్తుల నుంచి స్వీయరక్షణపై అవగాహన



జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్



మాక్‌డ్రిల్‌లో అగ్నిమాపక సిబ్బంది

బళ్లారి సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): ఇండియా, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థిలు నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు విపత్తుల సయమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లావిపత్తు నిర్వహణ అథారిటీ శనివారం సండూర్‌లోని తోరణగల్లు సమీపంలో జేఎస్‌డబ్ల్యూ విజయనగర టౌన్‌షిప్‌లో 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహిం చింది. నైపుణ్యం కలిగిన అగ్నిమాపక విభాగం, పోలీసు విభాగం, జేఎస్‌డబ్ల్యూ క్యూఆర్‌టీ, సెర్చ్ అండ్ రెస్క్యూ విమానాశ్రయ భద్రతా బృందం, డాగ్ స్క్వాడ్ , అగ్నిమాపక దళం బృందం, ఇతర బృందాలతో సహా 100మందికి పైగా సిబ్బంది మాక్‌డ్రిల్ ప్రదర్శించారు. విపత్తుల సమయంలో ప్రథమ చికిత్స చర్యలు, సురక్షితమైన ప్రదేశంలో దాక్కోవడం, కుక్కల ఆపరేషన్, ఇతర సమచారం గురించి ప్రజలకు అవగాహన కల్పించాచరు. ఈసందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ పి.ప్రమోద్, తోరణగల్లు డివిజన్ డీఎస్పీ ప్రసాద్‌గోఖలే, ఆరోగ్య శాఖ అధికారులు,ఫ్యాక్టరీలు, బాయిలర్లు, పారిశ్రామిక భద్రత, ఆరోగ్య శాఖ అధికారులు , హోంగార్డులు, పశుసంవర్ధక , పశువైద్య సేవల శాఖ అధికారులు, జిల్లా విపత్తు నిర్వహణ నిపుణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సలీం అహ్మద్

కాంగ్రెస్ సంబరాలకు కదలిరండి

● శాసనమండలి సభ్యుడు సలీం అహ్మద్ పిలుపు

బళ్లారి సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల సాధన, రాబోయే మూడు సంవత్సరాలకు ప్రభుత్వ ఆలోచనలు, తదితర కార్యక్రమాలకు కార్యకర్తలు తరలిరావాలని, ఈ నెల 20న హోస్పేటలో జరగనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని శాసనమండలి సభ్యుడు సలీం అహ్మద్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, తప్పుడు వాగ్దానాలు, పేదలు, రైతులపై జరుగుతున్న అన్యాయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈసదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశానికి లక్ష మందికి పైగా అబ్దిదారులు, రెండు లక్షల మందికి పైగా కార్మికులు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే.శివకుమార్ సహా రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కిమటీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, మేయర్ ముల్లంగి నందీశ్.కార్పోరేషన్‌సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మీనళ్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విజయోత్సవ సమావేశాన్ని విజయవంతం చేద్దాం



కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు బసవరాజు, శివన్నను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కంప్లి : ఈ నెల 20వ హోస్పేట నగరంలో జరుగనున్న కంప్లి నియోజకవర్గం నుండి 25 వేల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు బ్యాడిగి ఎమ్మెల్యే, కంప్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బసవరాజు శివన్న తెలిపారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయ హాలులో జరిగిన సాధన ముందస్తు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులకు దాదాపు రూ. 52 వేలకోట్లు కేటాయించామన్నారు. గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజానుకూల ప్రాజెక్టులను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడానికి చాలా కృషి చేసిందన్నారు. ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడిఆదేశాల మేరకు మే 20న హోస్పేటలో ప్రభుత్వ పరికరాల అంకిత సదస్సు జరుగుతుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు కంప్లి నియోజకవర్గం నుండి 25 వేల మందిని తీసుకురావడానికి 300 బస్సులు, 750 క్రషర్ల ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాన్నారు. అనంతరం బ్యాడిగి ఎమ్మెల్యే బసవరాజు శివన్నను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎంసీ అధ్యక్షులు హబీబ్ రెహమాన్, మున్సిపల్ అధ్యక్షుడు బట్టాప్రసాద్, స్టాండింగ్ కమిటీ అధ్యక్షులు ఎం ఉస్మాన్, సభ్యులు సీఆర్ హనుమంత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, చెన్న బసవరాజు, ప్రధాన కార్యదర్శి వాల్మీకి రఘు నాయకులు కే షణ్ముఖప్ప, ఎం సుధీర్, సయ్యద్ ఉస్మాన్, గోపాలకృష్ణ, జాఫర్‌షా, సుధ, జాఫర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ఎస్ ఆధ్వర్యంలో జనస్పందన

బళ్లారి సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం కర్ణాటక రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని తాలూకా కార్యాలయం ముందు బహిరంగ సభ, సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా కేఆర్ఎస్ పార్టీ జిల్లాధ్యక్షుడు యుగంధర్,జిల్లా ప్రధానకార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి,జిల్లా కార్యదర్శులు కట్టెబసప్ప,శ్రీనివాసులు, తాలూకా ఆర్గనైజింగ్ కార్యదర్శులు కేఎస్ ఖాదర్‌బాషా, యల్లప్ప, తాలూకా వర్కర్స్ మహాభాష, గాదిలింగప్ప, మంజునాథ్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరులకు విజయసిందూరం



బళ్లారిలో ర్యాలీ




హోస్పేటలో..

బళ్లారి సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో కిరాతకంగా హతమార్చిన ఉగ్రవాదుల ఏరివేతకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యిందని, ఉగ్రవాదులను మట్టి కరిపించిన జవాన్లకు జేజేలు అంటూ కొనియాడారు. శనివారం ఆపరేషన్ సింధూర ను విజయవంతంగా నిర్వహించిన భారత సైన్యాన్ని అభినందించడానికి హోస్పేట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నేతృత్వంలో భారీ విజయ యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు అశ్విని కోతాంబరి ,కాకుబాల్ రాజేంద్ర,భూపాల ప్రహ్లాద్,హోస్పేట్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధ్యక్షుడు ఇమామ్ నియాజీ, బీజేపీ జిల్లాధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, శివచార్య మహాస్వామి నందిపురం మఠం, శంకర్ మహాస్వామి, పురపాలక సంఘం అధ్యక్షుడు రమేశ్ కుమార్, చంద్రకాంత్, రాఘవేంద్ర, అశోక్‌జీరె, రామన్న, సాలిసిద్దయ్యస్వామి, శంకర్ మేటీ, అయ్యలి తిమ్మప్ప, జంబునాథ్ , మున్సిపల్ కౌన్సిల్‌సభ్యులు నరసింహ మూర్తి , విశ్వహిందూ పరిషత్ జిల్లాకార్యదర్శి శ్రీలత నీతా పాటిల్, రాజేశ్వరీ, చెన్నమ్మ, వీణ, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

● బళ్లారిలో దుర్గమ్మదేవాలయ ఆవరణం నుండి వందలాది మంది జాతీయ పతాకాన్ని చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీగా సాగారు. ఈసందర్భంగా సైనికుల సంఘం మాజీ అధ్యక్షుడు ప్రతాప్ మాట్లాడుతూ వీరోచితంగా పోరాడిన సైనికుల సేవలు అద్వితీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ పక్కీరప్ప, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, హనుమంతప్ప, బీజేపీ జిల్లాధ్యక్షులు అనిల్ నాయుడు, యల్లనగౌడ పాల్గొన్నారు.

▼ మాట్లాడుతున్న సైనికుల సంఘం మాజీ అధ్యక్షుడు ప్రతాప్ ▼



ధణిసంద్రలో తిరంగాయాత్ర

బెంగళూరు: ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై బ్యాటరాయనపుర బీజేపీ నియోజకవర్గం ఆధ్వర్యంలో శనివారం తిరంగాయాత్ర నిర్వహించారు. ధణిసంద్ర నుంచి హునసెమారనహళ్ళి వరకు తిరంగాయాత్ర జరిగింది. జాతీయ పతాకాలతో కార్యకర్తలు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి హెచ్‌సీ తమ్మేశ్‌గౌడ, బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడు ఎస్ హరీశ్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

నురగమయమైన కెలవరపల్లి డ్యామ్



నురగతో నిండిన జలాశయం

హోసూరు, మే 17(ఆంధ్రజ్యోతి): హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలలో శుక్రవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. తెన్నైనదీ పరీవాహక ప్రాంతంలో కూడా వర్షం నమోదైంది. దీంతో కెలవరపల్లి డ్యామ్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. కొద్దిరోజులుగా డ్యామ్‌కు నీటి ప్రవాహం తక్కువగా ఉండగా శుక్ర, శనివారాలలో పెరిగింది. 492 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం డ్యామ్ నుంచి కూడా అదే ప్రమాణంలో నీటిని విడుదల చేశారు. శనివారం విడుదలైన నీరులో భారీగా నురగ ఉండడంతో రైతులలో ఆందోళన నెలకొంది. రసాయన వ్యర్థాలు కలవడంతోనే ఇది తలెత్తిందని తెలుస్తోంది. దీంతో రసాయన వ్యర్థాలు డ్యామ్‌లో కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు, రైతులు కోరుతున్నారు.

ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

కంప్లి, మే 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కుడితిని వద్ద కేపీసీఎల్‌లో పోలీసులకు ప్రమాదాలపై ఈడీ ఉదయ్‌కుమార్, డీవైఎస్పీ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం కేపీసీఎల్ లో టెర్రరిస్టులు దాడి చేసినప్పుడు మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పోలీసులు, డాక్టర్స్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఇతర అంశాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఈడీ ఉదయ్‌కుమార్



స్వాధీనం చేసుకున్న గుట్కా బస్తాలతో పోలీసులు

400 కిలోల గుట్కా స్వాధీనం

హోసూరు క్రైం, మే 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి హోసూరు మీదుగా కోయంబత్తూరు 400 కిలోల గుట్కాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం హోసూరు రాయకోట రోడ్డు పరిధిలో తనిఖీలు నిర్వహించారు. లారీని పరిశీలించినవేళ గుట్కా అక్రమంగా నిల్వ చేసినట్టు గుర్తించారు. తుమకూరుకు చెందిన లారీ డ్రైవర్ నరసింహరాజు (41)ను అరెస్టు చేశారు. గుట్కా విలువ సుమారు 2లక్షలు ఉండవచ్చునని అంచనా వేశారు. గుట్కాను, లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గుట్కా అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

ఆలయంలో నగదు.. నగలు చోరీ

హోసూరు, మే 17(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కెలమంగలం సమీపాన అంకొండపల్లిలోని పురాతన కరకతమ్మాళ్ ఆలయంలో దొంగలు పడ్డారు. శుక్రవారం రాత్రి పూజ అయ్యాక యథాప్రకారం తాళం వేశారు. ఉదయం ఆలయానికి రాగా తాళం పగులగొట్టబడి ఉండడాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు చేరుకుని విషయాన్ని పోలీసులకు తెలిపారు. అమ్మవారి మెడలోని నగలు, హుండీలోని నగదును దుండగులు దోచుకున్నట్టు గుర్తించారు. కెలమంగలం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ఆలయం వద్ద గుమిగూడిన గ్రామస్థులు